నియోజకవర్గ అభివృద్ధికి నిధులు లేనట్టేనా?

ఎమ్మెల్యేల ప్రత్యేక నిధులు కేటాయించని ప్రభుత్వం

మేడ్చల్, ఫిబ్రవరి 23(నమస్తే తెలంగాణ): నియోజకవర్గాల ప్రత్యేక అభివృద్ధికి నిధుల మంజూరులో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తుంది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి నియోజకవర్గ అభివృద్ధికి నిధులు(సీడీఎఫ్) కేటాయించలేదు. దీంతో నియోజకవర్గాలలో ఉన్న సమస్యలను పరిష్కరించేందుకు సీడీఎఫ్ నిధులు ప్రభుత్వం మంజూరు చేయకపోవడంతో అభివృద్ధి పనుల జాడ లేకుండా పోయింది. ప్రతి సంవత్సరం ఎమ్మెల్యేలకు ప్రత్యేక కోటా కింద సంవత్సరానికి సీడీఎఫ్ నిధులను రూ.5 కోట్ల నిధులను ప్రభుత్వం కేటాయిస్తుంది. అయితే, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయినా సీడీఎఫ్ నిధులను ఇప్పటి వరకు కేటాయించలేదు. దీంతో నియోజకవర్గాలలో ఉన్న సమస్యలను పరిష్కరించేందుకు నిధుల లేమితో అభివృద్ధి పనులకు నోచుకోవడం లేదు. ప్రతి ఎమ్మెల్యేలకు రూ.5 కోట్లు ప్రత్యేక నిధుల కేటాయింపుతో రూ.2 కోట్ల నిధులతో ప్రభుత్వం పాఠశాలల అభివృద్ధి, రూ.3 కోట్ల నిధులతో మౌలిక సదుపాయాల కల్పనకు వినియోగిస్తారు. కాగా, మేడ్చల్ – మల్కాజిగిరి జిల్లాలోని మేడ్చల్, మల్కాజిగిరి, ఉప్పల్, కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి నియోజకవర్గాలకు సీడీఎఫ్ నిధులను ఇప్పటి వరకు కేటాయించలేదని అధికారుల ద్వారా తెలిసింది. నియోజకవర్గ ప్రత్యేక అభివృద్ధి నిధులపై జిల్లాకు చెందిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు లేఖలు రాసిన విషయం తెలిసిందే.

అభివృద్ధి పనుల నిధుల కేటాయింపుపై విమర్శలు

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో ఉన్న ఐదు నియోజకవర్గాలకు సంబంధించి రూ.50 కోట్లు ప్రత్యేక నిధులను ప్రభుత్వం కేటాయించిన స్థానిక ఎమ్మెల్యేలను సంప్రదించకుండానే వివిధ అభివృద్ధి పనులను నిధులను కేటాయించింది. కాంగ్రెస్ నాయకులు సూచించిన అభివృద్ధి పనులకు జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్ బాబు ఇచ్చిన లేఖలకు నిధులు కేటాయించడంపై సర్వత్రా విమర్శలు వస్తున్నాయి. నియోజకవర్గాలపై స్థానిక ఎమ్మెల్యేలకు పూర్తి అవగాహన ఉంటుందని, కానీ, వారిని కాదని కాంగ్రెస్ నాయకులు సూచించిన వాటికే నిధులు కేటాయింపు జరగడం ఏమిటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. జిల్లాలోని ఐదు నియోజకవర్గాలకు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఉన్నందునే ప్రభుత్వం ఇలాంటి నిర్ణయం తీసుకుందున్న ఆరోపణలు వస్తున్నాయి. ప్రత్యేక నిధులు పేరిట మంజూరు చేసిన రూ.50 కోట్ల నిధులు వృథా అయ్యే అవకాశం ఉందని బీఆర్ఎస్ నాయకులు ఆరోపిస్తున్నారు. సమస్యలను గుర్తించని కాంగ్రెస్ నాయకులు సూచనల మేరకు అభివృద్ధి పనులు కేటాయించడాన్ని చూస్తుంటే పనులు చేయకుండానే నిధులు దుర్వినియోగం చేసేలా చూస్తున్నట్లు బీఆర్ఎస్ నాయకులు ఆరోపిస్తున్నారు. ఎమ్మెల్యేల ద్వారానే నిధులు కేటాయింపులు జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్న డిమాండ్లు వస్తున్నాయి.

పేదల సొమ్మును దోచే హక్కు మోడీకి ఎక్కడిది?

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్.వీరయ్య

చిక్కడపల్లి, ఫిబ్రవరి 23: పేదల సంపదను కార్పొరేట్లకు దోచిపెట్టే హక్కు మోడీకి ఎక్కడిదని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్.వీరయ్య అన్నారు. వికలాంగుల హక్కుల జాతీయ వేదిక తెలంగాణ(ఎన్పీఆర్డీ) రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఎన్పీఆర్డీ15వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా 'కేంద్ర బడ్జెట్ – వికలాంగులపై ప్రభావం' అనే అంశంపై సెమినార్ ను ఎన్పీఆర్డీ రాష్ట్ర అధ్యక్షులు కె.వెంకట్ అధ్యక్షతన నిర్వహించారు. సెమినార్ కు ముఖ్య అతిథిగా సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్.వీరయ్య హాజరై మాట్లాడారు. కేంద్ర ఆర్థిక సర్వే దేశంలో సరుకుల అమ్మకాలు తగ్గిపోయాయని, తగిన వేతనాలతో కూడిన ఉపాధి అవకాశాలు పడిపోయాయని పేర్కొంటే మోడీ ఎందుకు స్పందిచడం లేదన్నారు. 22 కోట్ల ప్రజలు రోజుకు రూ.300 మాత్రమే వేతనం పొందుతున్నారని, మోడీ ప్రభుత్వం మాత్రం నెలకు రూ.4628తో కుటుంబం బ్రతకాలని చెప్పడం సిగ్గుచేటన్నారు. స్థూల జాతీయోత్పత్తి పెంచకుండా వికసిత భారత్‌ను ఎలా సాధిస్తారని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2025–26 బడ్జెట్ సరళీకృత ఆర్థిక విధానాలను మరింత వేగంగా అమలు జరిపేందుకు దోహదం చేస్తుందన్నారు. వ్యవసాయ కూలీలు, పేద రైతులు, కౌలు రైతుల ఊసె బడ్జెట్లో లేదన్నారు. పెరుగుతున్న ప్రజల అవసరాలను తీర్చే విధంగా బడ్జెట్ లేదని విమర్శలు చేశారు. మారుమూల గ్రామాల్లో ప్రజలు మంచినీరు కొనుక్కోవలసిన దుస్థితి ఏర్పడిందని, పెట్రోల్, డీజిల్ ధరలు పెరగడం వలన తీవ్ర ఇబ్బంది పడుతున్నారని అన్నారు. విద్యా, వైద్యం ఖరీదుగా మారిపోతుందని తెలిపారు. ప్రజలు సమస్యలతో సతమతమవుతుంటే మోడీ ప్రభుత్వం మాత్రం కార్పొరేట్ శక్తుల ప్రయోజనాల కోసం పని చేయడం సిగ్గుచేటని అన్నారు. రైతుల రుణ మాఫీకి అంగీకరించని మోడీ ప్రభుత్వం, గత పదేళ్లలో బడా బాబులు బ్యాంకులకు అప్పులు చెల్లించకుండా బకాయి పెట్టిన రూ.14.46 లక్షల కోట్లు మాఫీ ఎందుకు చేసిందని ప్రశ్నించారు. కార్పొరేట్ సంస్థల లాభాలు 22.3 శాతం పెరిగాయని ఎకనామిక్ సర్వే రిపోర్టు తేల్చిన విషయన్ని మోడీ గుర్తించాలని సూచించారు. ఆహార సరుకుల ద్రవ్యోల్బణం పెరిగిన నేపథ్యంలో ధాన్యం కొనుగోళ్లు పెంచాలని డిమాండ్ చేశారు. బీమా రంగంలో నూటికి నూరు శాతం విదేశీ పెట్టుబడులకు అవకాశం కల్పించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించడం సరైనది కాదన్నారు. కేంద్ర బడ్జెట్ లో సవరణలు చేసి సంక్షేమ పథకాలకు నిధులు పెంచాలని డిమాండ్ చేశారు. ఎన్పీఆర్డీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.అడివయ్య మాట్లాడుతూ, 2012 నుంచి పెన్షన్లలో కేంద్ర ప్రభుత్వం వాటా కేవలం రూ.300 లు మాత్రమే చెల్లిస్తుందని, దీనితో వికలాంగులు ఎట్లా బ్రతుకుతారని ప్రశ్నించారు. నిత్యావసర సరకుల ధరలు 300 రెట్లు పెంచిన మోడీకి, వికలాంగుల పెన్షన్స్ పెంచాలనే ఆలోచన ఎందుకు రావడం లేదన్నారు? ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు కె.వెంకట్, కేంద్ర కమిటీ సభ్యులు ఆర్.వెంకటేశ్, సాయమ్మ, జె.రాజు, రాష్ట్ర ఉపాధ్యక్షులు బొల్లేపల్లి స్వామి, ఉపేందర్, యశోద, అరీఫా, లింగన్న, సహాయ కార్యదర్శులు నాగలక్ష్మి, దశరథ్, గంగాధర్, రాష్ట్ర కమిటీ సభ్యులు మధు బాబు, భుజంగ రెడ్డి, బాలయ్య, రమేశ్, కుర్మయ్య, ప్రకాశ్, గౌతమ్, సంగప్ప, చంద్రమోహన్, చెన్నయ్య, పి.నర్సిములు పాల్గొన్నారు.

సెమినార్ లో మాట్లాడుతున్నసీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్.వీరయ్య

ఓయూ పరిధిలోని ఆంధ్ర మహిళా సభ కళాశాలలో ఆదివారం జరిగిన వేడుకలో పాల్గొని 'ఆనందేశి నాగరాజు రచనలు' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న విశ్రాంత ఐఏఎస్ అధికారి నంది వెలుగు ముక్తేశ్వర రావు, చిత్రంలో తదితరులు

రవీంద్రభారతిలో సినిమా ప్రొడక్షన్ వర్క్‌షాప్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మామిడి హరికృష్ణ, చిత్రంలో సినిమా దర్శకులు అక్షర కుమార్, సినిమాటోగ్రాఫర్ అర్జున్ తదితరులు

పుస్తకాలు చదవడం అలవర్చుకోవాలి

● బాలల లైబ్రరీ ప్రారంభోత్సవంలో వేద కుమార్ మణికొండ

చిక్కడపల్లి, ఫిబ్రవరి 23: సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ బాలోత్సవం ఆధ్వర్యంలో ఆదివారం బాలల లైబ్రరీ ప్రారంభోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన వేద కుమార్ మణికొండ చిన్నారుల లైబ్రరీని ప్రారంభించారు. ఈ సందర్భంగా వేద కుమార్ మణమాట్లాడుతూ పుస్తకాలకు హాయ్... చెప్పి సెల్ ఫోన్‌కు బాయ్... చెప్పాలని పిలుపునిచ్చారు. పుస్తకాలు చదవడం వల్ల మన జ్ఞానం, మనస్సు, సృజనాత్మకత, కమ్యూనికేషన్ నైపుణ్యాలు పెరుగుతాయని సూచించారు. పాఠ్యపుస్తకాలతో పాటు పార్టీయేతర పుస్తకాలు కూడా చదవాలి, చిన్న వయసు నుండే పిల్లలకు పఠనాసక్తి పెంపొందించే లక్ష్యంగా ఈరోజు పిల్లల లైబ్రరీని ప్రారంభించడం మంచి పారినమన్నారు. నేటి విద్యా విధానాలు పాఠ్య పుస్తకాలు తప్ప ఇతర పుస్తకాలు చదవకుండా నిరోధిస్తున్నాయని, తల్లిదండ్రులు గమనించాలని సూచించారు. పుస్తకం అంటే ప్రశ్నించే తత్వం విమర్శనాత్మక ఆలోచన ఉన్నతులుగా తీర్చిదిద్దే విజ్ఞాన భాండాగారం పిల్లల లైబ్రరీ అని అన్నారు పిల్లల కోసం ఒక బస్సు ఇస్తానని హామీ ఇచ్చారు పిల్లలంతా సంతోషం వ్యక్తం చేశారు. పిల్లల కోసం ఒక బస్సు ఇస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమానికి భూపతి వెంకటేశ్వర్లు ఉపాధ్యక్షురాలు కె.సుజావతి అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి పిల్లల డాక్టర్ టి.నళిని, సుందరయ్య విజ్ఞాన కేంద్రం కార్యదర్శి ఎస్.వినయ్‌కుమార్, తెలంగాణ బాలోత్సవం కార్యదర్శి ఎన్ సోమయ్య, నవీన్,రాజేంద్ర ప్రసాద్ , డాక్టర్ లలితా రాము తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న వేద కుమార్ మణికొండ

జేఎన్జే సొసైటీ డైరెక్టర్లుగా నేమాని, వంశీల ఎన్నిక

ఖైరతాబాద్, ఫిబ్రవరి 23: జవహర్‌లాల్ నెహ్రూ జర్నలిస్ట్స్ మ్యుచువల్లీ ఎయిడెడ్ కో ఆపరేటీవ్ హౌజింగ్ సొసైటీ లిమిటెడ్ డైరెక్టర్లుగా నేమాని భాస్కర్, ఎన్.వంశీ శ్రీనివాస్‌లు ఎన్నికయ్యారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం సొసైటీ ఎన్నికలు నిర్వహించారు. టీమ్ జేఎన్‌జే నుంచి తాతా శ్రీనివాస్ రావు, బోడపాటి శ్రీనివాస్ రావులు బరిలో నిలువగా, ఫ్రెండ్స్ ప్యానెల్ నుంచి నేమాని భాస్కర్, వంశీ శ్రీనివాస్‌లు పోటీలో నిలిచారు. వీరితో పాటు స్వతంత్ర అభ్యర్థిగా కొత్తపల్లి రమేశ్ బాబు పోటీ చేశారు. మొత్తం 950 ఓట్లకు గాను 724 ఓట్లు పోలు కాగా, పది ఓట్లు తిరస్కరణకు గురయ్యాయి. ఉదయం 8 గంటలకు ప్రారంభమైన ఎన్నికలు సాయంత్రం 4గంటల వరకు పోలింగ్ కొనసాగింది. బోడపాటి శ్రీనివాస రావుకు 342, ఎన్.వంశీ శ్రీనివాస్‌కు 382 ఓట్లు రాగా, నేమాని భాస్కర్‌కు 386, తాతా శ్రీనివాస రావుకు 334, కొత్త రమేశ్ బాబుకు 4 ఓట్లు దక్కాయి. నేమాని భాస్కర్ ప్రత్యర్థి తాతా శ్రీనివాస రావుపై 50 ఓట్ల తేడాతో గెలుపొందారు. అలాగే, వంశీ శ్రీనివాస్, బోడపాటి శ్రీనివాసరావుపై 40 ఓట్ల తేడాతో గెలుపొందారు. నేమాని భాస్కర్ ఐదేండ్లు, వంశీ శ్రీనివాస్ ఏడాది కాల పరిమితిలో డైరెక్టర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తారు. ఈ ఎన్నికల్లో ఎన్నికల అధికారిగా చోల ఓం ప్రకాశ్ వ్యవహరించారు.

సినిమా ప్రొడక్షన్ రంగంలో ఉచిత శిక్షణ

సిటీబ్యూరో, ఫిబ్రవరి23(నమస్తే తెలంగాణ): సినిమా రంగంలోకి ప్రవేశిస్తున్న కొత్త తరాన్ని ప్రోత్సహించేందుకు తెలంగాణ భాష, సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు ప్రొడక్షన్ డిజైన్ వర్క్‌షాప్ నిర్వహిస్తున్నట్లు ఆ శాఖ సంచాలకులు మామిడి హరికృష్ణ తెలిపారు. ఆదివారం రవీంద్రభారతిలో కార్యక్రమ పోస్టర్‌ను ఆవిష్కరించారు.

ఇంధనం ఆదా చేసేలా.. సైకిల్ మారథాన్

ఏఎస్ రావునగర్‌లోని ఎన్ఎస్ఐసీ నుంచి సైకిల్ మారథాన్ నిర్వహిస్తున్న దృశ్యం.

కాప్రా, ఫిబ్రవరి 23: ఏఎస్ రావు నగర్‌లోని నేషనల్ స్మాల్ ఇండస్ట్రీస్ కార్పొరేషన్ (ఎన్ఎస్ఐసీ) బిజినెస్ పార్కులో గెయిల్ ఆధ్వర్యంలో ఆదివారం సైక్లోథాన్ సైకిల్ మారథాన్ నిర్వహించారు. ఈ ర్యాలీ ఐదు కిలోమీటర్లు కొనసాగింది. ఇంధనం ఆదా చేసేందుకు ఈ సైకిల్ మారథాన్ కార్యక్రమాన్ని నిర్వహించినట్టు గెయిల్ చీఫ్ జనరల్ మేనేజర్ దేవకాంత్ సిన్హా తెలిపారు. భవిష్యత్ తరాల కోసం గ్యాస్, ఆయిల్ తదితర ఇంధనాలను ఆదా చేయాలని సూచించారు. కార్యక్రమంలో గెయిల్ జనరల్ మేనేజర్ ఎస్ఎం బాషా, యోగేశ్ గౌతమ్, సుబ్రమణి, ఆనంద్ కుమార్‌తో పాటు పలువురు ర్యాలీలో పెద్ద సంఖ్యలో గెయిల్ ఉద్యోగులు పాల్గొన్నారు.

దాశరథి - ఆరుద్రల సాహిత్యం నేటి సమాజానికి అవసరం

ప్రముఖ విమర్శకులు, పాత్రికేయులు తెలకపల్లి రవి

చిక్కడపల్లి, ఫిబ్రవరి 23: ఆధునిక తెలుగు సాహిత్య రంగంలో తమ కవిత్వంతో ఓ వినూత్న శకాన్ని సృష్టించిన మహాకవులు 'దాశరథి, ఆరుద్ర' అని ప్రముఖ విమర్శకులు, పాత్రికేయులు తెలకపల్లి రవి అన్నారు. తెలంగాణ సాహితీ ఆధ్వర్యంలో ఆదివారం బాగ్ లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో 'దాశరథి – ఆరుద్ర శత జయంతి' సందర్భంగా సాహిత్య సమాలోచన సదస్సును నిర్వహించారు. ఇందుకు ముఖ్య అతిథిగా హాజరైన తెలకపల్లి రవి మాట్లాడుతూ, అవినీతికి, అరాచక పాలనకు ఎదురు తిరిగి తన కలాన్నే ఆయుధంగా ఎక్కుపెట్టి సింహగర్జన చేశాడని అన్నారు. మహాకవి డా. దాశరథి. 'అగ్నిధార', 'రుద్రవీణ', 'తిమిరంతో సమరం' వంటి కవితా సంపుటాలు దాశరథి కవితావేశాన్ని చాటి చెబుతాయన్నారు. 'ఖుషీ ఖుషీగా నవ్వుతూ..' అంటూ ఎన్నో సినిమా పాటలు రాసి వెండితెరపై తన ముద్రను పదిలపర్చారని తెలిపారు. తెలంగాణ పోరాట దృక్పథంతో 'త్వమేవాహం' వంటి కావ్యాన్ని రాసిన మహాకవి డా. ఆరుద్ర దానిని ప్రచురించింది 'దాశరథి' అని గుర్తుచేశారు. 'సమగ్రాంధ్ర సాహిత్యం' ఆయనను గొప్ప పరిశోధకుడిగా నిలబెట్టిందన్నారు. తెలంగాణ సాహితీ రాష్ట్ర ఉపాధ్యక్షులు అనంతోజు మోహన కృష్ణ అధ్యక్షతన జరిగిన సదస్సులో తెలంగాణ సాహిత్య అకాడమీ కార్యదర్శి నామోజు బాలాచారి, ప్రముఖ కవి, విమర్శకులు, కాళోజీ పురస్కార గ్రహీత ఆర్.సీతారాం, హైదరాబాద్ బుక్ ఫెయిర్ అధ్యక్షులు, కవి యాకూబ్, నాళేశ్వరం, డా.మల్లెగోడ గంగాప్రసాద్, దాశరథి సినిమా పాటలపై డా. బి.బాలకృష్ణ, దాశరథి కథలపై పెద్దపల్లి తేజస్వి, 'దాశరథి విమర్శ–అనువాదాలు'పై డా. శివరాత్రి సుధాకర్ పరిశోధనాత్మక ప్రసంగాలు చేశారు. అనంతరం, ఆరుద్ర సాహిత్యంపై తెలంగాణ సాహితి రాష్ట్ర ఉపాధ్యక్షులు అనంతోజు మోహనకృష్ణ అధ్యక్షతన జరిగిన సదస్సులో ఆరుద్ర 'త్వమేవాహం' కావ్యంపై డా.గంజి శశిధర్, మౌనశ్రీ మల్లిక్, బండారి రాజ్ కుమార్, తెలంగాణ సాహితీ రాష్ట్ర ఉపాధ్యక్షులు తంగిరాల మాట్లాడారు. నాయకులు సలీమ, శరత్ సుదర్శి, పేర్ల రాము, ముజాహిద్ అలి, మేరెడ్డి రేఖ, ఖాజా మొయినుద్దీన్, మహేశ్ దుర్గే, రాహుల్, తదితరులు పాల్గొన్నారు.

సదస్సులో మాట్లాడుతున్న ప్రముఖ పాత్రికేయులు తెలకపల్లి రవి, చిత్రంలో తదితరులు

హైదరాబాద్‌లో జర్మనీ బృందం పర్యటన

సిటీ బ్యూరో, ఫిబ్రవరి 23(నమస్తే తెలంగాణ): జర్మనీకి చెందిన కార్ల్‌స్రూహ్రే నగరం నుంచి హైదరాబాద్ పర్యాటనకొచ్చిన ప్రతినిధి బృందానికి హైదరాబాద్ ఇంపాక్ట్ హబ్ ఆతిథ్యమిచ్చింది. ఈ సందర్భంగా జీహెచ్ఎంసీ మేయర్ విజయలక్ష్మి, ఇంపాక్ట్ హబ్ చైర్మన్ విజయ్ కుమార్, సీఈవో డాక్టర్ నాగరాజులతో బృంద సభ్యులు సమావేశమయ్యారు. సరిహద్దు సహకార అవకాశాలు, హైదరాబాద్‌లో అంకురాల వ్యవస్థపట్ల బృంద సభ్యులు మార్కస్ భేష్ ప్రశంసలు కురిపించారు. భవిష్యత్తులో మరిన్ని సహకార అవకాశాలపై ఆసక్తి వ్యక్తం చేశారు.

ఎస్సీ బిల్లును ప్రవేశపెట్టే యోచనను ప్రభుత్వం విరమించుకోవాలి

దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షు డు వడ్లమూరి కృష్ణ స్వరూప్

హిమాయత్ నగర్ , ఫిబ్రవరి23: ఎస్సీ వర్గీకరణ బిల్లును అసెంబీల్లో ప్రవేశపెట్టి ఆమోదించే ప్రయత్నాలను విరమించుకోవాలని దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షుడు వడ్లమూరి కృష్ణ స్వ రూప్, మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు డాక్టర్ వి.ఎల్.రాజు, రాష్ట్ర అధ్య క్షుడు జేఎన్ రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హిమాయత్ నగర్ లో ని మాల మహానాడు కేంద్ర కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఎస్సీ జాబితాల్లోని 58 కులాలకు అన్యాయం చేస్తూ మాదిగ సామాజిక వర్గానికి ప్రయోజనం చేకూర్చే విధంగా వర్గీకరణ బిల్లును ప్రభుత్వం తీసుకువస్తుందన్నారు. రాజ్యాంగ నిబంధనలను పట్టించు కోకుండా ఎస్సీ వర్గీకరణను ప్రభుత్వం చేసే తీరును వ్యతిరేకిస్తూ జాతీయ ఎస్సీ కమిషన్ చైర్మన్ కిశోర్ మాక్వానకు విజ్ఞాపన పత్రాన్ని పంపించడం జరిగిందన్నారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 12 వేల బ్యాక్ లాగ్ ఉద్యో గాలను భర్తీ చేయడంతో పాటు ఎస్సీ, ఎస్టీల సమగ్రాభివృద్ధి కోసం సబ్ ప్లాన్ నిధులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న ఓటు బ్యాంకు రాజకీయాలను ఉద్యమాలతో అడ్డుకోవాలని మాలలకు పిలుపునిచ్చారు. అనంతరం, నిరసన కార్య క్రమాలకు సంబంధిచిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో మాల మహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షుడు వల్లం సురేశ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నక్కా దేవేందర్ రావు, గ్రేటర్ అధ్యక్షుడు అక్కిదాసరి రవీంద్రబాబు, బేగరి సంక్షేమ సంఘం అధ్యక్షుడు పి.సుచందర్ పాల్గొన్నారు.

హిమాయత్ నగర్‌లోని మాల మహానాడు కేంద్ర కార్యాలయంలో కర పత్రాలను ఆవిష్కరిస్తున్న నేతలు

కాప్రా సాకేత్ కాలనీలోని వర్ల కన్వెన్షన్ హాలులో ఆదివారం జరిగిన మాజీ మంత్రి, ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్ మేనల్లుడి వివాహానికి ఎమ్మెల్సీ కవిత, ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, మీర్‌పేట్ హెచ్‌బీ కాలనీ డివిజన్ కార్పొరేటర్ జే.ప్రభుదాస్, బీఆర్ఎస్ నాయకులు హాజరై వధూవరులను ఆశీర్వదించారు.
– కాప్రా

కార్మికుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వాల నిర్లక్ష్యం

రిటైర్డ్ ఐఏఎస్ టి.చిరంజీవులు

చిక్కడపల్లి, ఫిబ్రవరి 23: కార్మికుల సమస్యల పరిష్కారంలో ద్వంద్వ ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని మాజీ ఐఏఎస్ అధికారి, బీసీ ఇంటలెక్చువల్స్ ఫోరం చైర్మన్ టి.చిరంజీవులు అన్నారు. తెలంగాణ కుకింగ్ గ్యాస్ డెలివరీ వర్కర్స్ ట్రేడ్ యూనియన్ ఐదో మహాసభ ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన బీసీ ఇంటలెక్చువల్స్ ఫోరం చైర్మన్ టి చిరంజీవిలు మాట్లాడుతూ కార్మికుల చట్టాలు అమలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని, కార్మికుల సంక్షేమాన్ని గాలికి వదిలేసారని ఆయన విమర్శించారు. కుకింగ్ గ్యాస్ డెలివరీ వర్కర్లు బలహీనవర్గాల నుంచి వచ్చిన వారు అయినందువల్లే ప్రభుత్వం కార్మికుల చట్టాలు అమలు చేయడంలో నిర్లక్ష్యం వహిస్తుందని ఆయన ధ్వజమెత్తారు. ప్రముఖ ప్రజా ఉద్యమ నేత డాక్టర్ చెరుకు సుధాకర్ గౌడ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ఇంకా కార్మికుల హక్కుల కోసం అడుక్కోవడం సిగ్గుచేటని అన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో కార్మికుల పాత్ర కీలకమైందని రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గ్యాస్ డెలివరీ కార్మికుల సమస్యలను నిర్లక్ష్యం చేస్తుందన్నారు. వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు నకిరేకంటి శ్రీనివాస్ గౌడ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సోషల్ జస్టిస్ పార్టీ అధ్యక్షులు, యూనియన్ సలహాదారులు చామకూర రాజు, తెలంగాణ రాష్ట్ర ఇన్‌చార్జ్ కేవీ గౌడ్, ఉద్యమకారుడు మంగిళిపల్లి శంకర్, బహుజన ప్రజాశక్తి కన్వీనర్ నల్ల లక్ష్మణ్, యూనియన్ ప్రధాన కార్యదర్శి బుర్ర చంద్రయ్య గౌడ్, ఉపాధ్యక్షులు ఎండి యూనస్, కోశాధికారి రమేశ్, కార్యనిర్వాహక కార్యదర్శి రమేశ్, అజయ్ రెడ్డి, నర్సింగ్, రాజేశ్, రాకేశ్, రాజశేఖర్, రంజిత్, సుధాకర్, సోషల్ జస్టిస్ పార్టీ నాయకులు అనిల్, బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.

సభలో మాజీ ఐఏఎస్ అధికారి చిరంజీవులు తదితరులు

ఉత్సాహంగా సంకల్ప్ సురక్షా రన్

శేరిలింగంపల్లి, ఫిబ్రవరి 23: గచ్చిబౌలి స్టేడియంలో సంకల్ప్ స్వచ్ఛంద సంస్థ, సొసైటీ ఫర్ సైబరాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్(ఎస్సీ ఎస్సీ) ల సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సంకల్ప్ సురక్షా రన్ కార్యక్రమం ఉత్సాహంగా సాగింది. ఆదివారం ఉదయం ఏర్పాటైన ఈ కార్యక్రమానికి సైబరాబాద్ జాయింట్ కమిషనర్ డి.జోయల్ డేవిస్ ముఖ్య అతిథిగా హాజరై జెండా ఊపి ప్రారంభించారు. బాలల లైంగిక వేధింపుల నివారణ, భద్రత లక్ష్యంగా అవగాహన పెంపొందించేందుకు ఈ రన్ కార్యక్రమం నిర్వహించారు. సంకల్ప్ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపక అధ్యకురాలు హేమలత విజయ రాఘవన్, సీడ్ వర్క్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ సీఈఓ వెంకట్రామ్ వసంతవాడ, సద్గురు మేనేజ్ మెంట్ కన్సల్టెంట్ సీఈఓ విజయ రాఘవన్ కన్నన్ లతో పాటు దాదాపు 1700 మంది ఔత్సాహికులు ఎంతో ఉత్సాహంగా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఎండోమెట్రియోసిస్‌పై అవగాహన కలిగేలా

సిటీబ్యూరో, ఫిబ్రవరి 23(నమస్తే తెలంగాణ) : మహిళల్లో వయసు పెరుగుదలతో పాటు సంభవించే ఎండోమెట్రియోసిస్ (గర్భాశయపు పొరల్లో సంక్లిష్టత) పై అవగాహన కలిగించేందుకు ఎండోమెట్రియోసిస్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో త్వరలో ఎల్లో రిబ్బన్ 2025 పేరుతో రన్ జరగనుంది. ఇందుకు సంబంధించిన వివరాలు సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ప్రకటించనున్నారు. ఈ కార్యక్రమానికి ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ ఆర్వీ కర్ణన్, ఎండోమెట్రియోసిస్ ఫౌండేషన్ ఫౌండర్ డాక్టర్ విమీ బింద్రా, నటి, సామాజిక కార్యకర్త సాయి కామాక్షి పాల్గొననున్నారు.